

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

నిజామాబాద్

కామారెడ్డి

బుధవారం 12 నవంబర్ 2025 8 పేజీలు

సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి


# అంతిమ సంస్కారాలకు అవస్థలు..

## - వరద ఉధృతికి స్మశాన వాటిక ధ్వంసం..

## - కనీస సౌకర్యాలు కరువు..

**సూర్య- నవీపేట్**

యంచ గ్రామంలో గోదావరి నది ఒడ్డున నిర్మించిన స్మశాన వాటికలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. రెండు నెలల క్రితం అల్పపీడన ప్రభావం, ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది ఉప్పొంగి ప్రవహించింది. కని విని ఎరుగని రీతిలో వరదలు ముంపు గ్రామాలను చుట్టేయడంతో. పరివాహక ప్రాంతమైన యంచ గ్రామ శివారులో గల గోదావరి నది ఒడ్డున ఎంజిఎన్ఆర్ఇజియస్ పథకం కింద 12 లక్షల 60 వేల నిధులతో నిర్మించిన స్మశాన వాటిక పూర్తిగా ధ్వంసమై దయనీయ పరిస్థితులు ఏర్పడడంతో కనీస సౌకర్యాలు లేక అంతిమ సంస్కారాలు జరుపుకోవడానికి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారు 16 వందల జనాభా కలిగి ఉండగా స్మశాన వాటిక లో సరైన సదుపాయాలు కరువయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో స్మశాన వాటికలు నిర్మించడం వల్ల అంతిమ సంస్కారాల ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జరుగుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల స్మశాన వాటికలలో సమస్యలు ఏర్పడినప్పుడు మరమ్మత్తులు చేపట్టి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గోదావరి నది భారీ వరదల కారణంగా గ్రామంలో గల స్మశాన వాటిక నీట మునిగి నేలమట్టం అయ్యిందని ఈ స్మశాన వాటికకు మృతదేహాల (మిగతా 2లో)





### సాదాబైనామా దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

## - కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

భూభారతి రెవెన్యూ సదస్సులలో, ఆన్లైన్ ద్వారా వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా భూభారతి పెండింగ్ దరఖాస్తుల గురించి ఆరా తీశారు. అర్జీల పరిష్కారంలో అలసత్వ వైఖరిని కనబరుస్తున్న పలువురు తహసీల్దార్లపై కలెక్టర్ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కఠిన నిర్ణయాలు తీసుకునే వరకు చూడవద్దని, ఇప్పటికైనా దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం లక్ష్యం నెరవేరేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. అదే సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు తు.చ తప్పకుండా అమలు చేయాలని (మిగతా 2లో)



### వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

కామారెడ్డి మండలంలోని ఇస్రోజివాడి గ్రామంలో మంగళవారం రోజునవరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మి కంగా తనిఖీ చేసి కొనుగోలు తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. మంగళవారం కామారెడ్డి జిల్లా, ఇస్రోజివాడి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజలతో కలసి మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మట్లాడి వరి కొనుగోలు ప్రక్రియ, (మిగతా 2లో)

### పిట్లం పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన

# జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర



**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, మంగళవారం రోజున పిట్లం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మాత్తుగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరితో మాట్లాడారు.వారి పని తీరును స్వయంగా పరిశీలించారు. స్టేషన్ లోని రికార్డులు, లాక్అప్ రూమ్, మెన్ రెస్ట్ రూమ్, పార్కింగ్ (మిగతా 2లో)

### నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో

# అభివృద్ధి చేస్తా

## - ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

## - బిచ్కుంద మున్సిపాలిటీకి 15 కోట్లు మంజూరు

## - సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేస్తాం

**సూర్య నిజాంసాగర్**

జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గం లోని అన్ని గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాను అన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాను అన్నారు.బిచ్కుంద మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాను అన్నారు.బిచ్కుంద సెంట్రల్ లైటింగ్ పనుల పురోగతి పై మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులతో కలిసి మీడియా సమావేశం (మిగతా 2లో)



# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బిచ్కుంద సెంట్రల్ లైటింగ్ పనులు ఖచ్చితంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మొట్ట మొదటి మున్సిపాలిటీ అయిన బిచ్కుందను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. బిచ్కుందలో సెంట్రల్ లైటింగ్ పనుల జాప్యానికి గల కారణాలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు.ఎలక్షన్స్ ముందు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే కేవలం తన రాజకీయ లబ్ధి కోసం కాంట్రాక్టు అవ్వకుండానే ఆగ మేఘాల మీద సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారు అన్నారు.బిచ్కుంద ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ పబ్బం గడుపుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు..తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ ను తొలగించి కొత్త కాంట్రాక్టర్ కు పనులు అప్పగించడం జరిగిందని అన్నారు.ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ఏడు ఎనిమిది నెలల సమయం పట్టిందని తెలిపారు.సెంట్రల్ లైటింగ్ పనులు అన్ని శాఖల సమన్వయంతో చేయాల్సి ఉంటుందని అన్నారు .అదే సమయంలో జన జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా డ్,ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సి ఉంటుంది కాబట్టి పనులలో కొంత ఆలస్యం జరుగుతుందని వివరించారు.బిచ్కుంద ప్రజలు సహకరిస్తే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బిచ్కుంద మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చిత్త శుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు.మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు 15 కోట్లు మంజూరు అయ్యాయని, భవిష్యత్ లో మరిన్ని నిధులు తీసుకొస్తామని తెలిపారు. శాశ్వత త్రాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేయడానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అదే విధంగా టౌన్ ప్లానింగ్ కు సంబంధించి కూడా టెండర్స్ ప్రక్రియ పూర్తి అయినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.రాజకీయ నిరుద్యోగులు, అవకాశవాదులు చేస్తున్న విమర్శలు పట్టించుకోవద్దని సూచించారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తాను నియోజకవర్గం అభివృద్ధి పై దృష్టి సారించాను అన్నారు.

## అంతిమ సంస్కారాలకు అవస్థలు..

(మొదటి పేజీ తరువాయి)

వెంట వచ్చే వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దాని సంస్కారాలు నిర్వహించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటికలో స్నానాలు చేయడానికి సరైన సౌకర్యాలు కల్పించాలని, తాగడానికి మంచినీరు ఏర్పాటు చేయాలని, షెడ్లకు మరమ్మత్తులు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపి స్మశాన వాటికను పరిశీలించి తగు నిధులను మంజూరు చేసి వెంటనే మరమ్మత్తులు చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పాస్ పోర్ట్ పోయినది

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా పేరు బోయిని శ్రీనివాస్ తండ్రి పేరు: భూమయ్య అను నేను ఇ.నెం.2-1/7, తలమడ్ల, రాజంపేట మండలం, కామారెడ్డి జిల్లా ప్రాంతంలో నివాసం ఉంటున్నాను. తేదీ 15/08/2025 రోజున తలమడ్ల నుండి కామారెడ్డి టౌన్ వరకు టూ వీలర్ పై ప్రయాణిస్తున్న సందర్భంలో P5755401 నెంబర్ గల నా యొక్క పాస్ పోర్ట్ ఎక్కడనో పడిపోయింది. కావున పైన పేర్కొన్న నా యొక్క పాస్ పోర్టు ఎవరికైనా దొరికితే ఈ క్రింద పేర్కొన్న నా అడ్రస్ లో ఇవ్వగలరు.

**బోయిని శ్రీనివాస్**
**తండ్రి పేరు: భూమయ్య**
**ఇ.నెం.2-1/7, తలమడ్ల,**
**రాజంపేట మండలం, కామారెడ్డి జిల్లా**
**ఫోన్.నెం.90141 32154**

## గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడ మైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో సూర్య దినపత్రికకు ఏ విధమయిన సంబంధం లేదు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఒకవేళ ఏవైనా దరఖాస్తులు తిరస్కరణకు గురైతే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని, అవి సహేతుకమైనవి అయి ఉండాలని అన్నారు. కాగా, సబ్ కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాలకు పంపించబడే అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. తదుపరి సమీక్ష నిర్వహించే నాటికి సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి కనిపించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు.

**సూర్య, ఇందూర్**



భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరం (కలెక్టరేట్)లో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

**సూర్య, నిజాంసాగర్**

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మంగళవారం జుక్కల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలతో వచ్చిన ప్రజల దగ్గర నుండి అర్జీలు స్వీకరించి వారి యొక్క సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైన వాటిని పరిష్కరించారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం జుక్కల్ మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.



## ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

**- భూభారతి, ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై సమీక్ష**

**సూర్య, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి సందర్శించారు. తహసీల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక అమలుపై సమీక్ష జరిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయా కేటగిరీల వారీగా మ్యాపింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాద్రి ఉన్నారు.

## మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో నిలువ ధాన్యం ను వేలం వేసిన అధికారులు

**సూర్య, నాగిరెడ్డి పేట్**



నాగిరెడ్డి పేట్ మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విత్తన క్షేత్రానికి చెందిన సీడ్ కు పనికిరాని కూల్డ్ స్టోరేజ్ లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని మంగళవారం విత్తన క్షేత్రం అధికారులు వేలం వేశారు. విత్తన క్షేత్రంలో 2021-22 సంవత్సరంలో ఖరీఫ్ ,రబీ సీజన్లో సాగుచేసిన జేజీఎల్ 24423 దొడ్డు రకం వరి సీడ్ ధాన్యం ప్రస్తుతం సీడ్ కు పనికి రాకుండా నాన్ సీడ్ 770.5 క్వింటాళ్ల ధాన్యం నిల్వందని అధికారులు తెలిపారు.నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలంలోని మునిపల్లి గ్రామంలోని కే ఎస్ కూల్డ్ స్టోరేజ్ లో ఈ నాన్ సీడ్ వరి ధాన్యం నిల్వ ఉందని ,ఇట్టి నిలువ ధాన్యానికి వేలం వేసి నట్టు విత్తన క్షేత్రం ఏడీఏ ఇంద్ సేన్ తెలిపారు.ఈ వేలం పాటలో నలుగురు వ్యాపారస్తులు పాల్గొనగా, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన ఆగమయ్య అందరికంటే అధికంగా క్వింటాళ్ ధాన్యానికి 1910 రూపాయల చొప్పున పాట పాడి ధాన్యాన్ని కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, తెలంగాణ సీడ్స్ జిల్లా రీజినల్ మేనేజర్ రఘు,ఏడీఏ. డి ఏ ఓ కార్యాలయం లక్ష్మీ ప్రసన్న , ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యదర్శి శశికాంత్, విత్తన క్షేత్రం ఏ డి ఏ ఇంద్ర సేన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిట్లం పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రదేశాలు, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు అదేవిధముగా విధి నిర్వహణ, ప్రజలతో మర్యాదపూర్వక, సేవాభావం గల వ్యవహార శైలి ఉండాలని ఎస్పీ సూచించారు.
ఎస్పీ మాట్లాడుతూ ం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడం ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యత అని, విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయల్%-%100 కాల్స్‌కు బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణ స్పందన ఇవ్వాలని, అత్యవసర సేవల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. అలాగే, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ విధులను క్రమం తప్పకుండా నిర్వహించి దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిరోధించాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను తరచుగా చేపట్టి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. తదుపరి, సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలపై పూర్తి సమాచారం సేకరించి, ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ గారు ఆదేశించారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం జరగకూడదని సూచించారు. సిబ్బంది ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే వాటిని పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్పీ బి. విట్టల్ రెడ్డి, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్య, పిట్లం ఎస్సై పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(మొదటి పేజీ తరువాయి)

తేమ శాతం, తూకం విధానం, ధాన్యం నిల్వ సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో తూకం యంత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయా, తగిన బస్తాల సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను పరిశీలించారు. అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి కొనుగోలు నిర్వహించాలని, తేమ శాతం ఆధారంగా నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం ఎండబెట్టే ప్రదేశాలను పర్యవేక్షించి అవసరమైన సూచనలు సలహాలు చేశారు. రైతులు సమయానికి చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ ల పనితీరును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో మొత్తం 427 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు రైతుల నుండి కొనుగోలు చేసింది 1, 23, 993 మెట్రిక్ టన్నులు, ఇందులో దొడ్డురకం 59,162, సన్నరకం 64,831. 11,196 మంది రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగి, రైతుల ఖాతాలో 145 కోట్లు జమ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, %జవీ% శ్రీకాంత్, %జజా% రామ్మోహన్, ఎంపీడీవో, పంచాయితీ సెక్రటరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్ధం

**- కాసుల బాలరాజు**

**సూర్య బాన్సువాడరూరల్**

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు బాన్సువాడ పట్టణం అన్ని విధాలుగా సిద్ధమైందని తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసులబాలరాజు పేర్కొ న్నారు.సోమవారం రాత్రి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి పురుషుల, మహిళల సీనియర్స్ వాలీబాల్ టోర్నమెంట్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయ న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు .క్రీడాకారుల ప్రతిభ ను వెలికితీయ డానికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్విని యోగం చేసుకో వాలని సూచించి న ఆయన, స్థానిక శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు తానుకూడా క్రీడ లు,క్రీడాకారుల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాననిస్పష్టంచేశారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను కూడా బాన్సువాడలో నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.మినీ స్టేడియంలో అవసర మయ్యే వసతుల అభివృద్ధి విషయాన్ని శాసన సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి,అవసరమైన సహకారం



అందేలా కృషి చేస్తానన్నారు. బాన్సువాడ జట్లు మెరిశాయి..సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో పురుషులు మరియు మహిళల విభాగాల్లో బాన్సువాడ జట్లు అద్భుత విజయాలు సాధించి మెరిశాయి.పురుషుల ఫైనల్: బాన్సువాడ, తాడ్వాయి జట్ల మధ్య రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో చివరి సెట్లో ఉత్కంఠ పెరిగినా, బాన్సువాడ విజయం సాధించింది.మహిళల ఫైనల్లో బాన్సువాడ ,మగ్గిడి జట్లసమానశక్తులు ప్రదర్శించిన ఈ మ్యాచ్ కూడా చివరి పాయింట్ వరకు ఉత్కంఠభరితంగా సాగగా, విజయం బాన్సువాడ వైపు నిలిచింది.బాన్సువాడ జట్ల విజయం తో స్థానిక క్రీడాభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది.ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పోచారం..ఫైనల్ మ్యాచ్‌లలో విజయం సాధించిన బాన్సువాడ జట్లను శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఫోన్ ద్వారా అభినందించారు.అనివార్య కారణంగా ప్రత్యక్షంగా హాజరు కాలేక పోయి నా,బాన్సువాడ జట్లు ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయమని పేర్కొన్నారు .క్రీడా సదుపాయాల అభి వృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని,మినీ స్టేడియంలో అవసరమైన ఏర్పాట్లు త్వరలో చేపడ తామనిహామీ ఇచ్చారు.కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంగా గంగాధర్, సొసైటీ చైర్మన్ ఎరువాల కృష్ణారెడ్డి,నాయకులు నార్ల సురేష్,ఎజాజ్,నార్ల రవీందర్, ఖాలిద్,అలీముద్దీన్ బాబా, వాహాబ్, గౌస్, మాజీ కౌన్సిలర్లు హకీం, కిరణ్, వెంకటేశం, పి.డి. సురేందర్, జిల్లా వాలీబాల్ అసో సియేషన్ ప్రతినిధులు మల్లేశ్ గౌడ్, రవీందర్ రెడ్డి, కామారెడ్డి డివైఎస్ఓ రంగా గౌడ్, నిజామాబాద్ డివైఎస్ఓ నవీన్,వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘాల పనితీరు సంతృప్తికరం

**సూర్య- బిక్కనూర్**



జిల్లాలో గ్రామ సంఘాల పనితీరు సంతృప్తికరంగా ఉందని, వివిధ రాష్ట్రాల ప్రతినిధి బృందా సభ్యులు చెప్పారు. మంగళవారం మండలంలోని పలు మహిళా సమైక్య సంఘాలను ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, ఒరిస్సా రాష్ట్రాల నుండి ఎన్ ఆర్ ఎల్ ఎం బృంద సభ్యులు మహిళా సమైక్య సభ్యుల పనితీరును పరిశీలించారు. నాలుగు సంఘాలకు సంబంధించిన ఆడిట్ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహక విషయాలను తెలుసుకొని సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి, ఐకెపి ఏపిఎం సాయిలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి,సీసీలు, వివోఏలు, నాలుగు సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## మైనార్టీ గురుకులం కళాశాలను సందర్శించిన మైనార్టీ సంక్షేమాధికారి జయరాజ్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి మైనారిటీ గురుకులాన్ని సందర్శించిన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిమైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల కళాశాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జయరాజ్ సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన వంటగది, భోజనశాలను పరిశీలించి, ఆహార నాణ్యతను, పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడి వారి వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు. గురుకుల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన అధికారి, మంచి సేవలు కొనసాగించాలని సిబ్బందిని సూచించారు.

## సూపరింటెండెంట్ గా భాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్

**సూర్య, నాగిరెడ్డిపేట్**



నాగిరెడ్డిపేట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గా ప్రవీణ్ కుమార్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వ హించిన ప్రవీణ్ కుమార్ కు సూపరి ంటెండెంట్ గా పదో న్నతి లభించడంతో ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు నాగిరెడ్డి పేటకు బదిలీ చేశారు. దీంతో ఆయన నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టా రు. గతంలో నాగిరెడ్డిపేట ఎంపీ డీవో కార్యాల యంలో సూపరింటెండెంట్ గా పనిచేసిన వినోద్ కుమార్ జనవరి మాసం లో నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయి వెళ్లారు. సుమారు పది నెలలుగా ఖాళీగా ఉన్న అతని స్థానం లో జిల్లా అధికారులు సూపరి ంటెండెంట్ గా ప్రవీణ్ కుమార్ ను నియ మించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్ ఐ

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ కార్యాలయ ఆవరణలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య, గ్రామా పాలనాధికారి మల్లేశం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు నమోదు చేసే సమయంలో మొక్క జొన్న పంటకు బదులుగా వరి పంటగా నమోదు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటి నుండి అయినా ప్రతి రైతు తాము పండించే పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని, తద్వారా కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగవని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపేట్ ఊర చెరువులో చేప పిల్లల విడుదల

**సూర్య బాన్సువాడ రూరల్**



బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ ఊర చెరువులో మంగళవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల కార్యక్రమం జరిగింది. మత్స్యశాఖ అధికారి డోల్ సింగ్ ఆధ్వర్యంలో మొత్తం మూడు లక్షల 58 వేల చేప పిల్లలను చెరువులో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులలో చేపల ఉత్పత్తి పెంపుతో గ్రామీణ మత్స్య కారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గాదె సత్యం, ఉపాధ్యక్షులు పసుపుల సాయిలు, గ్రామ బోయి సంఘం అధ్యక్షులు రమేష్, కార్యదర్శి సాయిలు, గ్రామ పెద్దలు దేవారం నారాయణరెడ్డి, ఉద్దర హనుమాన్లు, దేవారం సాయిరెడ్డి, బోయి సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో గర్భిణీ స్త్రీ కి ఓ పాజిటివ్ రక్తం అందజేత

**– ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా యం,సమన్వయకర్త డాక్టర్ బాలు**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలు రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణి స్త్రీకి ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఐవిఎఫ్ సేవా రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వ యకర్త డాక్టర్ బాలు 78 వ సారి కే బి సి రక్త అనేది కేంద్రంలో రక్తదానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందజేసి ఉద్దేశంతో కామారెడ్డి రక్తదాతల సమూహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటివరకు 25వేల యూనిట్లపైగా రక్తాన్ని సేకరించడం జరిగిందని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడం కోసం కృషి చేస్తున్నామని అన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తాన్ని అందజేయాలని ఉద్దేశంతో 2023 వ సంవత్సరం నుండి మెగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ 4,500 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం జరిగిందని అన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహా అధ్యక్షులు జమీల్ హైమద్,ఉపాధ్యక్షులు పర్ష వెంకటరమణ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**సూర్య రెంజల్**



మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో జాతీయ విద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేపట్టారు. మంగళవారం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి ని పురస్కరి ంచుకొని, ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పి ంచారు. జాతీయ విద్య దినోత్సవం పురస్కరి ంచుకొని పాఠశాలలను విద్యా ర్థులకు వ్యాసరచన ఇతర క్రీడల పోటీలను నిర్వహించడం జరిగిం దని, గెలుపొందిన వారికి బహుమతులను మండల విద్యాశాఖ అధికారి ఆంజ నేయులు చేతులమీదుగా అందజేశారు. అనంతరం పాఠశాలలో విద్యా ర్థుల సాంస్కృతిక ప్రదర్శనను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రెసి డెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ అర్షియా నజుమా, వార్డెన్ హయేషా ఫాతి మా, వ్యాయామ ఉపాధ్యాయు రాలు శ్యామల, ఫిజికల్ డైరెక్టర్ భాగ్య శ్రీ, పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థినిల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డయల్ 100 ను మిస్ యూస్ చేసినందుకు నిందితుని పై చర్యలు ఒకరోజు జైలు శిక్ష

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



సమస్త ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు నమస్కారములు కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ అమీర్ అను వ్యక్తి నిన్నటి రోజున పోలీస్ అత్యవసర నెంబర్ అయినా డయల్ 100 కు పదేపదే కాల్ చేసి ఎటువంటి అత్యవసర పరిస్థితి లేకున్నా కూడా షేక్ అమీర్ మద్యం మత్తులో ఐదు సార్లు కాల్ చేసి పోలీ సు వారి విధులకు ఆటంక పరిచినందున షేక్ అమీర్ ను ఈరోజు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ గారి ముందు ఎస్. హెచ్. ఓ నరహరి హాజరు పరచగా అతనికి వెయ్యి రూపాయల జరిమానా మరియు ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగినది. సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమ నగా అత్యవసర సమయంలో వినియోగించాల్సిన టువంటి డయల్ 100 ను అత్యవసర సమయంలో తమకు అవసరమైన ప్పుడు మాత్రమే ఉపయో గించాలి కానీ అనవసరంగా Dail 100 కు కాల్ చేసి పోలీసుల యొక్క విలువైన సమయాన్ని వృధా చేయకూడదని విజ్ఞప్తి చేయుచున్నాము.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**సూర్య మోపాల్**

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని డీఈవో అశోక్ పేర్కొన్నరు. మోపాల్ మండలంలోని బోర్గం (పి) జెడ్పిఎచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టీ – శాట్, రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. డీఈవో హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు.సాయంత్రం ముగింపు కార్యక్రమానికి మోపాల్ ఎంఈవో గేమ్ సింగ్ హాజరై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ధ్రువపత్రాలు అందజేశారు ఉపన్యాస పోటిల్లో బి. రాధిక జెడ్పి ఎచ్ఎస్ మెండోరా, సీ ఎచ్ లలిత జెడ్పి ఎచ్ఎస్ ఘన్పూర్, వ్యసరచనలో టీ. హరిత జెడ్పిఎచ్ఎస్ నల్లవెల్లి, ఎం. సుదీప్తి జెడ్పిఎచ్ఎస్ సిరికొండ, క్విజ్ పోటిల్లో ఎస్. కార్తీక్ జెడ్పిఎచ్ఎస్ వెల్మల్, ఎన్. నితిన్ జెడ్పిఎచ్ఎస్ ముప్కాల్, వరసగా ప్రతమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ మూడు పోటిల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా ఈ నెల 12 నుంచి 13 వరకు హైదరాబాద్ లో జరిగే రాష్ట్రాస్తాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ధన్యవాదాలు

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఎర్రగడ్డ డివిజన్‌లోని 317,318,319, 320,321,362, 363,364 బూత్‌లలో కాంగ్రెస్ పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎర్రగడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకులు,బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ శ్రేణులకు ు అలాగే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి వచ్చి ఎర్రగడ్డ డివిజన్‌లో బూత్ ఇన్‌చార్జ్‌లుగా బాధ్యత లు స్వీకరించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ తరఫున శ్రమి చిన సీనియర్ నాయకులు, కార్య కర్తలకు హృదయ పూర్వక ధన్యవా దాలు తెలిపారు."మీ



అంద రి కృషి కాంగ్రెస్ పార్టీ విజయానికి బలమై న పునాది వేస్తుంది," అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి తెలిపారు.

## మహా అన్నదానానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం వితరణ

**సూర్య,బీర్కూర్**




బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శబరిమలలో జరిగే మహా అన్నదాన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ తరఫున మూడు క్వింటాళ్ల 50 కేజీల బియ్యాన్ని, మరియు 300 స్టీల్ గ్లాసులను జాతీయ అయ్యప్ప చిన్ముద సేవా ట్రస్ట్ సభ్యుడు కర్క సిద్ధుకు అందజేయడం జరిగిందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతలే రమేష్ తెలిపారు. ట్రస్ట్ సభ్యుడు సిద్ధు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా మహా అన్నదాన కార్యక్రమానికి తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులకు,దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. భక్తులు మహా అన్నదాన కార్యక్రమానికి ముందుకు రావడం చాలా సంతోషకరమైన విషయం అని అలాగే ఎంతో పవిత్రమైన శబరిమలైలోని అయ్యప్ప సన్నిధిని దర్శించుకోవాలని సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ మేకల గాలయ్య, జోన్ చైర్మన్ కొట్టూరి సంతోష్, లయన్స్ సభ్యులు మేకల విట్టల్, రషీద్, కిషోర్, రమేష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

## యాసంగిలో హరితడి పంటలకు మొగ్గు చూపాలి

**-జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి**

**సూర్య,లింగంపేట్**



యాసంగిలో హరితడి పంటలకు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి రైతులకు సూచించారు.ఆయన మంగళవారం లింగంపేట్ రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట కోత అనంతరం రైతులు పొలంలో చేపట్టే విధానం మామిడి తోటలో పూత సమయంలో తీసుకొనే జాగ్రత్తలు,చిరుధాన్యాల పంట సాగు,యాసంగిలో హరితడి పంటల విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏడిఏ లక్ష్మి ప్రసన్న,మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్,ఏఓ సంతోష్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాకేష్,రైతులు పాల్గొన్నారు.

## ఎంజేపీ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

**సూర్య మాక్లూర్**



మహాత్మ జ్యోతిబాపులే గురుకుల విద్యాసంస్థలు ఆధ్వర్యంలో మునిపల్లి లో జరిగిన అండర్ 14,19 జిల్లా స్థాయి విభాగంలో దాస్ నగర్ మహాత్మా జ్యోతిబాపులే గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు.వాలీబాల్ మొదటి స్థానం,చెస్ లో మొదటి స్థానం,లాంగ్ జంప్ విభాగంలో మొదటి స్థానం,కబడ్డీలో రెండవ స్థానం,హై జంప్ రెండవ స్థానం,షాట్ ఫుట్ రెండవ స్థానం,800,1500 విభాగంలో మొదటి స్థానంలో విజయాన్ని సాధించారు.ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు చికిత,ప్రీతి,శశిరేఖ,భవిత,ప్రశాంతి,అక్షయ లను మహాత్మా జ్యోతిబాపులే ప్రిన్సిపాల్ స్వప్న అభినందించారు

## హనుమాన్ ఆలయానికి విరాళం అందజేసిన కాంగ్రెస్ నాయకుడు చందు

**సూర్య,బీర్కూర్**



బీర్కూరు గ్రామంలోని హనుమాన్ ఆలయానికి బీర్కూరు మండలానికి చెంది న కాంగ్రెస్ నాయకుడు చందు 50వేల రూపాయలను, అదేవిధంగా ద్రోణ వల్లి కృష్ణారావు 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు మంగ ళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లా డుతూ గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయ గర్భగుడి మరమ్మత్తులకు విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చిన గ్రామస్తులకు అభినందన లను తెలియజేశారు. ఆలయానికి ఇద్దరు దాతలు కలిసి 102000 అందిం చడం గొప్ప విషయమని వారి కుటుంబాలకు ఆంజనేయస్వామి ఆశీర్వాదా లు ఎల్లప్పుడు ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సాయినాథ్, తిలకేశ్వరి రఘు, విజయ ప్రకాష్, అవారీ గంగారం, లాడేగామ గంగాధర్, మద్నూర్ నర్సింలు, ఇం గురాములు, యాట వీరేశం, కిరణ్, కొట్టూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

## న్యాయ సేవా సంస్థ దినోత్సవం

**సూర్య బోధన్**




బోధన్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందూరు మోడల్ హై స్కూల్‌లో మంగళ వారం "న్యాయ సేవా సంస్థ దినోత్సవం" సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి బోధన్ అదనపు మొదటి శ్రేణి న్యాయమూర్తి ఈసంపల్లి సాయిశివ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ మైనర్ బాలురు, బాలికలు లైసెన్స్ లేకుం డా వాహనాలు నడపరాదని, ఫోక్సో చట్టంపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. గురువులను గౌరవించడమే నిజమైన విద్యార్థి లక్షణమని, ప్రతి విద్యార్థిలో ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని పేర్కొన్నారు. మార్కులు మాత్రమే కాక సమాజంపై అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. కూడళ్ల వద్ద భిక్షాటన చేసే వారిని సహాయ కేంద్రాలకు చేర్పించడం ద్వారా సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ జి.శ్యాంరావు, డాక్టర్ పి.సమ్మయ్య, బొగ్గుల రవీంద్ర, న్యాయ సేవా సంస్థ సభ్యులు సిహెచ్ వి హనుమంత రావు, కళ్యాణి, అజయ్ కుమార్, బోధన్ పోలీస్ ఎస్సై భాస్కరాచారి ఇందూర్ మోడల్ హై స్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ ప్రధానోపాధ్యాయులు రామారావు, పి.ఎల్.వి పద్మాసింగ్, అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూలు వంద శాతం చేపట్టాలి

**సూర్య,లింగంపేట్**



ఇంటి పన్ను వసూలు ఈ నెలాఖరు వరకు వంద శాతం చేపట్టాలని ఎంపీడీఓ మలహరి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశిం చారు. ఆయన మంగళ వారం బానాపూర్ తాండా,బానాపూర్ గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు ఎప్పటికప్పుడు తీయించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచే విధంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేయాలన్నారు.వీరి వెంట పంచాయతీ కార్యదర్శులు రాజు,ఫరీదా,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉన్నారు.

## మద్యం సేవించి పట్టుబడిన ఇద్దరికీ జైలు

**- ఇకనుంచి పదివేల జరిమానా**

**సూర్య- నవీపేట్**



పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఇద్దరికీ నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కమలాపూర్ గ్రామానికి చెందిన ముల్కల అభిలాష్, మండల కేంద్రానికి చెందిన నేతికుంట మోహన్ లను మంగళవారం కోర్టులో హాజరుపరచగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నూతన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం మొదటి సారి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే రూ. 10 వేల జరిమానా తో పాటు ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించబడుతుందని, రెండోసారి పట్టుబడితే రూ. 15 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు లేదంటే రెండిటిని విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని తెలిపినారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ శివకుమార్

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని నర్సింగ్ రావు పల్లి చౌరస్తా వద్ద వాహనాలను నిజాం సాగర్ ఎస్సై శివ కుమార్ మంగళ వారం సాయంత్రం తనిఖీలు చేశారు. వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, వాహనాలను అతివేగంగా నడప వద్దని, వాహనాలకు సంబంధి ంచిన సరైన ధ్రువీకరణ పత్రాలను వాహనాలతో పాటు ఉంచుకోవా లన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్సును తప్పకుండా కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడుపుతున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం

**సూర్య- నవీపేట్**



మండలంలో గల జన్నేపల్లి గ్రామానికి చెందిన శ్రీను అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జన్నేపల్లి గ్రామానికి చెంది న నీరడి శ్రీను (42) బతుకుతెరువు కోసం దుబాయ్ వెళ్లి కొన్ని రోజుల క్రితం తిరిగి వచ్చాడని. తిరిగి వచ్చినప్పటి నుంచి కుటుంబంలో చిన్నచిన్న గొడవల కారణంగా కుటుంబ కలహాలు ఏర్పడి మనస్తాపం చెందిన శ్రీను గత నెల 26న ఉదయం ఇంట్లో నుండి బయలుదేరి ఇప్పటివరకు తిరిగి రాలేదని అన్నారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు బంధువుల ఇండ్లలో కుటుంబ సభ్యులు వెతికిన అతని ఆచూకీ లభించక పోవడంతో మంగళవారం శ్రీను భార్య నీరడి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

## మద్యం మత్తులో పదేపదే 100 కు డయల్ చేసిన వ్యక్తికి శిక్ష,జరిమానా

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ అమీర్ అను వ్యక్తి నిన్నటి రోజున పోలీస్ అత్యవసర నెంబర్ అయినా డయల్ 100 కు పదేపదే కాల్ చేసి ఎటువంటి అత్యవసర పరిస్థితి లేకున్నా కూడా షేక్ అమీర్ మద్యం మత్తులో ఐదు సార్లు కాల్ చేసి పోలీసు వారి విధులకు ఆటంక పరిచినందున షేక్ అమీర్ ను ఈరోజు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ గారి ముందు ఎస్. హెచ్. ఓ నరహరి హాజరు పరచగా అతనికి వెయ్యి రూపాయల జరిమానా మరియు ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగినది. సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా అత్యవసర సమయంలో వినియోగించాల్సినటువంటి డయల్ 100 ను అత్యవసర సమయంలో తమకు అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించాలి కానీ అనవసరంగా Dail 100 కు కాల్ చేసి పోలీసుల యొక్క విలువైన సమయాన్ని వృధా చేయకూడదని పట్టణ సిఐ నరహరి విజ్ఞప్తి చేశారు.

# మక్క కొనుగోలు కేంద్రం, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించినజిల్లా కలెక్టర్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం లోని మక్క కొనుగోలు కేంద్రం, కృష్ణాజివాడి గ్రామం లోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు సజావుగా సాగాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ మంగళవారం తాడ్వాయి మండలంలోని మక్కా కొనుగోలు కేంద్రం, కృష్ణాజీవాడి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మక్క పంటసాగు చేసిన రైతుతో ముఖాముఖిగా మాట్లాడి పంటల ఉత్పత్తి, ధరలు, ఆదాయ పరిస్థితులను తెలుసుకున్నారు. మక్క పంట వల్ల ఎంత లాభం వస్తుంది, పంటను కోతకు సిద్ధం చేయడానికి ఎంత కాలం పడుతుంది,వరి పంటతో పోలిస్తే మక్క పంట ద్వారా రైతులకు ఎంత అదనపు ఆదాయం వస్తుంది వంటి అంశాలపై చర్చించారు.రైతు మాట్లాడుతూ తమ అనుభవాలను, మార్కెట్ ధరలపై తమ అభిప్రాయాలను కలెక్టర్ గారితో పంచుకున్నారు. ప్రతీ సారి మక్క పంట సాగు చేయడం వలన వరి కంటే ఎక్కువ లాభం పొందుతున్నానని,



క్రాఫ్ తొందరగా అవుతుందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని వివరించారు. ఈ సందర్భంలో రైతు తన కొడుకుతో కలిసి కొనుగోలు కేంద్రం వద్ద కనిపించగా, కలెక్టర్ ఆ బాలుడిని పాఠశాలకు ఎందుకు వెళ్ళలేదని ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తల్లిదండ్రులకు సూచిస్తూ, "పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. పిల్లల భవిష్యత్తు కోసం విద్య చాలా ముఖ్యం. చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి," అని తెలిపారు.కలెక్టర్ రైతుల సూచనలు సేకరించి, పంటల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో కొనసాగాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రం వద్ద మాయిచ్చర్ ఎలా చెక్ చేస్తున్నారు అని అధికారులను అడిగి తెలుసుకొని మిషన్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆన్నా రు. హమాలీల కొరత ఏమైన ఉందా, గన్ని సంచులు సరిపడా ఉన్నాయని, ప్రతీ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని అన్నారు.లోకల్ యాప్ లో ఎంట్రీలు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.పంచాయితి సెక్రటరి, ఎంపిడిఓ, తదితర సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు కొనుగోలు పై పర్యవేక్షణ జరపాలనితెలిపారు.వానాకాలం 2025 సంవత్సరానికి గాను మొక్కజొన్న ను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు జిల్లాలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో ప్రస్తుతం 13 కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభించి ఇప్పటివరకు 2149.5 క్వింటాళ్లను రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందని, రైతులు తమ పంటను నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం 14 లోపు ఉండేటట్లు కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కనీస మద్దతు ధర 2400/- రూపాయలు పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు . కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, dm శ్రీకాంత్, dco రామ్మోహన్, తహసిల్దార్ శ్వేత , ఎంపిడిఓ, పంచాయితి సెక్రటరి, ఎంపిఒ, తదితరులు ఉన్నారు.

## రైతుల రవాణా గోడు కు స్పందించిన సీఈవో విశ్వనాథం

**- అభినందించిన రైతులు**

**సూర్య ఎల్లారెడ్డి**



ఎల్లారెడ్డి ప్రాథమిక సహకార సం ఘం పరిధిలోని వివిధ వరి కొను గోలు కేంద్రాలను సొసైటీ సీఈవో విశ్వనాథం మంగళవారం సంద ర్శించారు. ఈ సందర్భంగా రైతు లతో సమావేశమై వడ్లను తరలి ంచడానికి రవాణా సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. లారీ వాహనా ల కొరత, రవాణా ఆలస్యం కారణంగా మిల్లులకు ధాన్యం తరలి ంపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువ చ్చారు. శివనగర్ కేంద్రంలో 1,200 బస్తాలు, లక్ష్మాపూర్‌లో 950 బస్తాలు, మిషన్ పల్లి , అడవిలింగాల కేంద్రాల్లో 850 బస్తాలు తూకం వేసి సిద్ధంగా ఉన్న ప్పటికీ, లారీలు రాకపోవడం, రైస్ మిల్లులు ధాన్యం దించు కోవడంలో ఆలస్యం చేయడం వల్ల మూడు నుండి నాలుగు రోజులకు ఒకసారి మాత్ర మే తరలింపు జరుగుతోందని రైతులు గోడు వ్యక్తం చేశారు. రైతుల సమ స్యలను శ్రద్ధగా విన్న సీఈవో విశ్వనాథం తక్షణ చర్యలు తీసుకుంటా నని హామీ ఇచ్చారు. రవాణా సమస్య పరిష్కా రానికి ట్రాన్స్‌పోర్ట్ అధికారుల తో మాట్లాడి లారీలు సమయానికి అందేలా చర్యలు చేపడతానని తెలిపా రు. రైతుల వరి సకాలంలో మిల్లులకు చేరేం దుకు అవసరమైన వాహా నాల సమన్వయం చేయాలని సంబంధిత అధికా రులకు సూచిం చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలంటూ సీఈవో విశ్వనాథం సూచించారు. ఈ సందర్భంలో సొసైటీ సిబ్బంది, కమిటీ సభ్యులు, స్థానిక రైతులు పాల్గొ న్నారు. రైతుల సమస్యలపై సత్వర స్పందన చూపిన సీఈవో విశ్వనా థం కు రైతులు అభినందించారు.

## గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

**సూర్య రెంజల్**



మండలంలోని దండిగుట్ట గ్రామ మాజీ సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవి గుండెపోటుకు గురై మృతి చెందా రు. మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న సమయంలో గుండెపోటుకు గురై ఆమె ప్రాణాలను కోల్పోయినట్లు కుటుంబీకులు తెలిపారు. గ్రామపం చాయతీ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సర్పంచ్ గా ఐదు సంవత్సరాలపాటు గ్రామానికి అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించారని పలువురు గుర్తు చేశారు. ఆమె అంత్యక్రియలో మండల మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎన్‌డీసీసీ బ్యాంక్ ఊరట నిచ్చే రుణ పథకాలు

**- ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్**

**సూర్య ఎల్లారెడ్డి**



నిజామాబాద్ జిల్లా ఎన్‌డీసీసీ సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి అనుకూలంగా పలు రుణ పథకాలు అందుబాటులో ఉన్నాయ ని అధికారులు తెలిపారు. ఎల్లారెడ్డి పిఏసిసిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. కర్షకమిత్ర పథకం కింద ఎకరానికి రూ.2.50 లక్షల వరకు రుణ సౌకర్యం, బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.7,500 వరకు రుణం, అలాగే గ్రామీణ ప్రాం తాల్లో గృహ నిర్మాణానికి రూ.25 లక్షల వరకు రుణ సదుపాయం కల్పి స్తున్నట్లు అధికారులు తెలిపారు. అదనంగా, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 444 రోజుల కాలానికి 7.75% వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8.25% వడ్డీ రేట్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గండి మాసానిపేట వద్ద జరిగిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎఫ్ఎల్ సిసి అధికారి ప్రమోద్, కార్యదర్శి విశ్వనాథం రైతులతో సమావేశమయ్యా రు. రైతులకు రుణ సదుపాయాల గురించి వివరిస్తూ బ్యాంక్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గ్రామ సంఘాలకు సిఆర్పిలచే శిక్షణ

**సూర్యలింగంపేట్**



లింగంపేట్ మండల కేంద్రానికి చెందిన రామస్వామి మహిళా సంఘానికి మంగళవారం సీనియర్ సిఆర్పిలచే శిక్షణ ఇవ్వడం జరిగిందని ఏపిఎం వినోద్ తెలిపారు.గ్రామ సంఘాల ద్వారా సంఘాల సామర్థ్యం పెంచి సమ ర్ధవంతమైన నిర్వహణకు దోహదపడే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగింద న్నారు.రికార్డుల భద్రత,వివోఏ యాప్ లపై మార్గదర్శకాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.బ్యాంకు లింకేజీ, లోకో సంఘాల అప్పులను వివోఏలను సమన్వయం చేయడం, సిఐఎఫ్ వినియోగంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిఆర్పిలు శోభారాణి, నాగశ్రీ, సీసీ గంగరాజు, వివోఏలు,గ్రామ సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు మంత్రి పదవిరావాలని మొక్కులు

**సూర్య, నాగిరెడ్డి పేట్**



ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి రావాలని ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ మంత్రి పదవి వచ్చిన వెంట నే దుర్గ భవాని అమ్మవారికి తల నీలాలు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటామని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మంద గంగా రెడ్డి, రవీందర్ రెడ్డి,శంకరన్న,లక్ష్మణ్ ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకారం

**- ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు**

**సూర్య బాన్సువాడ రూరల్**



బాన్సువాడ మండలంలోనితాడ్కోల్ గ్రామంలో మహిళల ఆర్థిక స్వావలం బనకు దోహదం చేసే లక్ష్యంతో గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన కుట్టు శిక్షణ కార్యక్రమం విజయ వంతంగా ముగిసింది.ఈసందర్భ ంగా మంగళవారం కుట్టు మిషన్ల పంపిణీ మరియు ధృవ పత్రాల ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసులబాలరాజు ముఖ్య అతిథిగా హాజరై మహిళల కుకుట్టుమిషన్లు,ధృవపత్రాలుఅందజేశారు.ఆయన మాట్లాడుతూ, మహిళలు స్వంతంగా నిలదొక్కుకోవడమే నిజ మైన గ్రామాభివృద్ధి.భవిష్య త్తులో గ్రామస్వరాజ్ సంస్థచేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అంది స్తానుఅన్నారు.గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా 42 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ శిక్షణ ద్వారా మహి ళలు తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగు పరచుకునే దిశగా అడుగులు వేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్య క్రమంలో మాజీ జెడ్పీటీసీ గోపాల్ రెడ్డి,బుడ్మి సొసైటీ వైస్ చైర్మన్ మధుసూధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి మేడం, కోఆర్డినేటర్ మంజుల, జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాలేకు, కుమ్మరి రాజు, అబ్బాస్, లక్ష్మాగౌడ్,అందే రమేష్, బి.గోపి, హన్మం డ్లు, అంజయ్య,అక్బర్,హుస్సేన్,సరగ్గ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియనిరెండు అనాధ శవాలకి అంత్యక్రియలు నిర్వహించిన ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ

**సూర్య ఇందూర్**



గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలి యని 2 అనాధ శవాలకి నేడు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 1వ టాణా పోలీస్ సిబ్బంది మరి యు కామా రెడ్డి పోలీస్ సిబ్బంది అనుమతితో మంగళవారం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో మృతిచెందిన ఈ రెండు అనాధ శవాలకి సంబంధించి ఎవరో ఎక్కడివారో తెలియదు ఎలాంటి ఐడెంటిటి లేదు వారి దగ్గర రోడ్లపై నిస్సహాయక స్థితిలో ఉండగా పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడి చారు. వారి సంబంధికులు ఎవరు రాకపోవటంతో నేడు ఇందూరు యువ త స్వచ్ఛంద సేవా సంస్థ ఆ బాధ్యతను తీసుకుని అంతిమ సంస్కారాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మద్దుకూరి సాయిబాబు కోశాధికారి జయదేవ్ వ్యాస్, నరేష్ రెడ్డి, 1వ టాణా పోలీస్ సిబ్బంది రాజ్ గోపాల్, కామారెడ్డి పోలీస్ సిబ్బంది విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి వేడుకలు

**- ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన - మున్సిపల్ కమిషనర్ మహేష్ , ఎంపీడీవో తహెరా బేగం**

**సూర్య ఎల్లారెడ్డి**



మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం ను మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో తహరా బేగం, మున్సిపల్ కమిషనర్ మహేష్, ఎంపీ ఓ అతి నారపు ప్రకాష్. హాజరైనారు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఎంపీడీవో తహేరా బేగం, మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ ఆజాద్ తన 13వయేటనే అద్భుత సాహిత్య విమర్శను సృజించి విద్యార్థిని సలక్షన్ శోభితుడు గా అనేక బిరుదులు సాధించాడు దేశంలోని వివిధ జైలలో శిక్షలు అనుభవించినట్లు తెలిపారు 1923లో ఢిల్లీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు 35 సంవత్సరాల వయసులో మౌలానా ఆజాద్ అధ్యక్షత చేపట్టారు 1927లో కాంగ్రెస్ ముస్లిం లిగ్ ఐక్యతను సాధించినట్లు తెలిపారు అనంతరం మున్సిపల్ కమిషనర్ మహేష్ మాట్లాడుతూ 1947 జనవరి 15న ఆయన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినట్లు అప్పుడే విలక్షణమైన విద్య ప్రణాళికను అమలు చేశారు ఈరోజు ఆ గ్రామ అగ్రగామిగా వెలుగొందుతున్న అకాడమిక్ సాంకేతిక విద్యాసంస్థలకు మౌలానా ఆజాద్ అప్పుడే పునాదులు వేశారు స్వతంత్ర భారతదేశంలో విశిష్ట పాత్ర ను నిర్వహించారు , అనంతరం మాజీ జెడ్పిటిసి గాయాజుద్దీన్ మాట్లాడుతూ అటు స్వతంత్ర ఉద్యమంలో ఇటు స్వతంత్ర భారతదేశంలో విశిష్ట పాత్ర నిర్వహించి జీవిత చరమాంకంలో హిందూ ముస్లింల ఐక్యతకు ప్రగాఢంగా వాంక్షిస్తూ సాగిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 1958 ఫిబ్రవరి 22న ఆయన కన్నుమూశారని తెలిపారు, అనంతరం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పేరిట శాలువాలతో మున్సిపల్ కమిషనర్ మహేష్ , ఎంపీడీవో తాహెరా బేగం, ఎంపీ ఓ అతినారపు ప్రకాష్ శాలువాలతో సన్మానించి పూలబొకెలను అందజేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ తదితరులు తమ ప్రసంగాన్ని కొనసాగించారు అనంతరం ఉత్తమ విద్యార్థులను సన్మానించారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో భారతమాత భజన మండలి

**- ఇందూర్ వారి ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజన మహెూత్సవం..**

**సూర్య ఇందూర్:03**

ఆశ్రమాధిపతులు శ్రీ శ్రీ శ్రీ బాలయోగి కృష్ణ మహారాజ్,శ్రీ శ్రీ శ్రీ మధుసూదన నంద సరస్వతి మహారాజ్ నేతృత్వం వహించి భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు అందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించారు. “భారతమాత భజన పరివార్ – ఇందూర్ నిర్వహిస్తున్న ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దారి తీస్తాయి. యువతలో భక్తి,సేవా భావం పెంపొందించడంలో ఇలాంటి ప్రయత్నాలు కీలకం కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది అని తెలిపారు. “ధర్మో రక్షిత రక్షిత:” ధర్మాన్ని మనం కాపడితే ధర్మం మనల్ని కాపాడుతుంది. హిందూ సనాతన ధర్మం పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు.మన హిందూ ధర్మం ఎంతగా పెరుగుతుందో దానికి హిందూ వ్యతిరేక శక్తులు కూడా అంతగా తయారవుతున్నాయి.దీన్ని పసిగట్టి మన హిందూ ధర్మ ప్రచారానికి నారీశక్తి ముందువరుసలో ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే ని ఘనంగా సత్కరించారు.అదేవిధంగా శ్రీ శ్రీ శ్రీ పిట్ల కృష్ణ మహారాజ్,శ్రీ శ్రీ శ్రీ మధుసూదన నంద సరస్వతి మహారాజ్ గారు సనాతన ధర్మంపై లోతైన ప్రవచనాలు ఇచ్చి భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం అందించారు. మహారాజుల ఉపదేశాలతో భక్తులందరూ మనోనిగ్రహం,భక్తి, సేవా స్ఫూర్తి సూత్రాలను ఆచరణలో పెట్టాలనే సంకల్పం వ్యక్తం చేశారు.భజన పరివార్ సభ్యులు చేసిన భజనలు,హారతులు, జపాలు గుట్ట అంతటా పవిత్రతను నింపాయి. కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేసిన నిర్వాహక భక్తులకు,సేవకులకు అందరికీ మహారాజులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమ%శీ%లో నిర్వహకులు వైట్ల.సుబ్బారావ్,ప్రముఖ వక్త.లక్ష్మణరావు,మెగా. సుబేదార్,గణేష్,%ఎ. ఎ.ా% గంగా కిషన్, కాపర్తి.గురుచరణ్,బీజేపీ నాయకులు మాజీ కార్పొరేటర్ ప్రభాకర్, మఠ%శీ%.పవన్, మారవార్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

**సూర్య మోపాల్**

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని డీఈవో అశోక్ పేర్కొన్నరు. మోపాల్ మండలంలోని బోర్గం (పి) జెడ్పిఎచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టీ – శాట్, రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. డీఈవో హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు.సాయంత్రం ముగింపు కార్యక్రమానికి మోపాల్ ఎంఈవో గేమ్ సింగ్ హాజరై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ధ్రువపత్రాలు అందజేశారు ఉపన్యాస పోటిల్లో బి. రాధిక జెడ్పి ఎచ్ఎస్ మెండోరా, సీ ఎచ్ లలిత జెడ్పి ఎచ్ఎస్ ఘన్పూర్, వ్యసరచనలో టీ. హరిత జెడ్పిఎచ్ఎస్ నల్లవెల్లి, ఎం. సుదీప్తి జెడ్పిఎచ్ఎస్ సిరికొండ, క్విజ్ పోటిల్లో

## బాన్సువాడలో పోలీసులు అప్రమత్తం..

**- బస్టాండ్‌లో విస్తృత చెకింగ్**

**సూర్య బాన్సువాడ రూరల్**

ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో బాన్సువాడ పట్టణంలో పోలీసులు అప్రమత్త మయ్యా రు. మంగళవారం రాత్రి బాన్సువాడ బస్టాండ్‌లో సీఐ తుల శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా చెకింగ్ నిర్వహించారు.బస్టాండ్‌లో ప్రయాణికుల లగేజీ,వాహనాలు,అనుమానాస్పద వ్యక్తులను జాగ్రత్త గా పరిశీలిం చారు.సీఐ తుల శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,భద్రతా చర్యల్లో సహ కరించాలని విజ్ఞప్తి చేశారు.పట్ట ణంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం చెకింగ్ నిరంతరం కొనసాగుతాయని ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

## త్వరలో సమస్య పరిష్కరిస్తాం

**సూర్య పెద్ద కొడప్గల్**

మండలకేంద్రంలోమంగళవారం ఉదయం 11%ఎజ% వైర్ లు తెగి ఇండ్ల పై పడటం తో గ్రామస్తులు రోడ్డు పై బైఠాయించి ధర్నా చేయడం తో ఎస్సై అరుణ్ కుమార్ జోక్యం చేసుకొని విద్యుత్ ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వగా విద్యుత్ బాన్సాడ డిఈ విజయ సారధి క్షేత్ర స్థాయిలో వెళ్లి పర్యటించి స్థానికుల సమస్యలను పరిశీలించారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఈసమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని,శాశ్వత మార్గం కోసం విధివిధానాలనురూపొందించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక పంపుతామనీ హామీ ఇవ్వడంతో స్థానికులు అధికారుల మాట పై నమ్మకంతో తమకు సహకరిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏడిఏ సంజీవ్ రావ్,ఏఈఓ పవన్ కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ కే వి రామయ్య లైన్మెన్ కాశీరాం, జేఎల్ఎం వినోద్, నాయకులు మహేందర్ రెడ్డి,మోహన్, గ్రామస్తులు లక్ష్మణ్, నాగరాజు,నాగాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డయల్ 100 ను మిస్ యూస్ చేసినందుకు నిందితుని పై చర్యలు ఒకరోజు జైలు శిక్ష

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

సమస్త ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రు లకు నమస్కారములు కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ అమీర్ అను వ్యక్తి నిన్నటి రోజున పోలీస్ అత్యవసర నెంబర్ అయినా డయల్ 100 కు పదేపదే కాల్ చేసి ఎటువంటి అత్యవసర పరిస్థితి లేకున్నా కూడా షేక్ అమీర్ మద్యం మత్తులో ఐదు సార్లు కాల్ చేసి పోలీ సు వారి విధులకు ఆటంక పరిచినందున షేక్ అమీర్ ను ఈరోజు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ గారి ముందు ఎస్. హెచ్. ఓ నరహరి హాజరు పరచగా అతనికి వెయ్యి రూపాయల జరిమానా మరియు ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగినది. సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమ నగా అత్యవసర సమయంలో వినియోగించాల్సిన టువంటి డయల్ 100 ను అత్యవసర సమయంలో తమకు అవసరమైన ప్పుడు మాత్రమే ఉపయో గించాలి కానీ అనవసరంగా Dail 100 కు కాల్ చేసి పోలీసుల యొక్క విలువైన సమయాన్ని వృధా చేయకూడదని విజ్ఞప్తి చేయుచున్నాము.

## 58 వ సారి రక్తదానం చేసిన కమ్మరి శ్రీనివాస్.

**- అభినందించిన జిల్లా రక్తదాతల సేవా సమితి**

**సూర్య కామారెడ్డి టౌన్**



అన్ని ధానాల కన్నా అన్నదానం గొప్పది, అన్నదానం కన్నా రక్తదానం గొప్పది. అన్నదానం చేస్తే ఒక పూట కడుపునిండుతుంది అదే రక్తదానం చేస్తే మనిషికి పునర్జన్మను ఇస్తుంది. రక్తదాతల సేవా సమితి ప్రతినిధి సామాజిక సేవకుడు,రాజంపేట మండల కేంద్రానికి చెందిన “ కమ్మరి శ్రీను “ గారు రక్తదానం చేసి యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న “నవ్య” అనే మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉందని తెలవగానే సేవా సమితి ప్రతినిధి లికమ్మరి శ్రీనులి గారు వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది. ఈ ఈ సందర్భంగా రక్తదాతకు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ ముదాం శ్రీధర్ పటేల్ గార్లు కృతజ్ఞతలు తెలిపారు

## ఘనంగా మౌలాన అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**సూర్య బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ చందన ఆధ్వర్యంలో మౌలానా 1888 నవంబరు 11 న జన్మించారు. ఈయె భారత ప్రభుత్వ తాలి విద్యాశాఖా మంత్రి గాను మరియు స్వాతంత్ర్య సమరయోదుడుగా ఉన్నాడు. ఈయన విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకరావడం జరిగింది పేర్కొన్నారు, మౌలానా విద్యపట్ల చేసిన కృషిని వివరించడం జరిగింది. మర్కస్ కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి తల్లిదండ్రుల కలలు సాకారం చేసేలా ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. మైనార్టీ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని అన్నారు. సచివాలయం ఉద్యోగుల్లో అత్యధిక శాతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారేనని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యను అందిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చందన, మర్కస్ కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ రియాజుద్దీన్, కార్యదర్శి మొహమ్మద్ అక్బర్, సహాయక కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘాల పనితీరు సంతృప్తికరం

**సూర్య- బిక్కనూర్**

జిల్లాలో గ్రామ సంఘాల పనితీరు సంతృప్తికరంగా ఉందని, వివిధ రాష్ట్రాల ప్రతినిధి బృందా సభ్యులు చెప్పారు. మంగళవారం మండలంలోని పలు మహిళా సమైక్య సంఘాలను ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, ఒరిస్సా రాష్ట్రాల నుండి ఎన్ ఆర్ ఎల్ ఎం బృంద సభ్యులు మహిళా సమైక్య సభ్యుల పనితీరును పరిశీలించారు. నాలుగు సంఘాలకు సంబంధించిన ఆడిట్ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహక విషయాలను తెలుసుకొని సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి, ఐకెపి ఏపిఎం సాయిలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి,సీసీలు, వివోఏలు, నాలుగు సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## మైనార్టీ గురుకులం కళాశాలను సందర్శించిన మైనార్టీ సంక్షేమాధికారి జయరాజ్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి మై నారిటీ గురుకులాన్ని సందర్శించిన జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిమైనా రిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల కళాశాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జయరాజ్ సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన వంటగది, భోజనశాలను పరిశీలించి, ఆహార నాణ్యతను, పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడి వారి వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు. గురుకుల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన అధికారి, మంచి సేవలు కొనసాగించాలని సిబ్బందిని సూచించారు.

## సూపరింటెండెంట్ గా భాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్

**సూర్య, నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో సూపరింటెండెంట్ గా ప్రవీణ్ కుమార్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. నిజాం సాగర్ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వ హించిన ప్రవీణ్ కుమార్ కు సూపరి ంటెండెంట్ గా పదో న్నతి లభించడంతో ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు నాగిరెడ్డి పేటకు బదిలీ చేశారు.